

# మచ్చ

వాణిశ్రీ

కృష్ణమూర్తికి పెళ్ళయింది. అత్తవారిది అదే వూరు.

మొదటి రాత్రి.

సుశీల సర్వాలంకార భూషితురాలై, మల్లెపూల జడను వేసుకుని సిగ్గుతో తలను వంచుకుని పాలగ్లాసు అందిచింది.

కృష్ణమూర్తి పాలగ్లాసు అందుకుని టీపాయ్‌మీద ఉంచాడు.

"సుశీలా!"

"వూఁ..."

"ఎలావుంది నీకు."

"సిగ్గుగా వుందండీ."

"సిగ్గునరేలేవోయ్. ఒక క్రొత్త అనుభూతి కలగడం లేదూ!"

"క్రొత్తగానే వుందండీ!"

"మనం ఈరోజునుంచీ నేనే నువ్వుగా నువ్వే నేనుగా ఉండాలి."

"వూఁ..."


"నువ్వే నా సర్వస్వం. నీ అందచందాలు, నీ నిర్మలమైన మనసు, పవిత్రమైన హృదయం...అన్నీ .నావే. ఏం?"

"వూఁ..."

"నా మనసు వెన్నవలె సున్నితం. నాకు అసూయగూడా ఎక్కువే. నా సర్వస్వం నువ్వే అనుకుంటున్నప్పుడు నువ్వు పరాయి మగవాళ్లను కన్నెత్తి చూసినా, పన్నెత్తి పలకరించినా నాకు బాధ కలుగుతుంది. అంతేకాదు నేనిక నీతో కాపురం చెయ్యలేను.''

"అలాగేనండీ. ఎవరితోనూ మాట్లాడను. ఎవర్నీ చూడను. ఒట్టండీ.'

"వెరీ గుడ్. నువ్వు మంచిదానివి. ఇలారా. నువ్వు చాలా అందంగా వున్నావు సుశీలా."




"వూఁ..."

"సుశీలా!"

"వూఁ..."

"మన ఇద్దరిదీ ఈ వూరేగదా! ఇదివరకెప్పుడైనా నన్ను చూశావా!"

"చూశానండీ."

"ఎక్కడ? ఎప్పుడు?"

"వుహుఁ...నేను చెప్పను. నాకు సిగ్గుగా వుందండీ."

"సిగ్గెందుకు చెప్పు."

"ఐదారేళ్ళక్రితం మిమ్మల్ని చూశానండీ."

"అదే ఎక్కడ చూశావ్?"

"మా స్కూల్ దగ్గరే."

"మీ స్కూల్ దగ్గరా?"

"అవునండీ. మీరు స్కూలు గేటు బైట నిల్చునివున్నారు. నన్ను పిలిచి "పాపా! ఈ కవరు అదుగో...ఆ ఎర్రచీర కట్టుకున్న అమ్మాయికి ఇవ్వు." అని నీలంరంగు కవరు ఇచ్చారండీ."

"ఛా...నేనా!"

"అవునండీ! మీరే. నాకు బాగా గుర్తున్నారు."

"కాదు...ఆ అబ్బాయి ఎవరో ఏమిటో నాలాగే వుండివుంటాడు. ఔనా!"

"ఔనేమో లెండి పాపం. ఎవరో ఆ అబ్బాయి."

"పాపం ఏం?"

"మర్నాడు ఆ అబ్బాయిని, ఆ ఎర్రచీర అమ్మాయివాళ్ళ అన్నయ్య పీవు విమానంమోత మోగించి వళ్లు వాయగొట్టాడండీ. ఆ అబ్బాయికి పాపం మీకుంది చూడండీ బుగ్గన నల్లమచ్చ అలాంటిది పడింది. పాపం ఎవరో ఆ అబ్బాయి. అన్నట్లు మీకామచ్చ ఎందుకు పడిందో."